# సీఎం పర్యటనకు అధికారులు అందుబాటులో ఉండాలి

◆ వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ◆ ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

వికారాబాద్, ఫిబ్రవరి 19 : వికారాబాద్ జిల్లాలో ఫిబ్రవరి 21న కోస్గిలో నిర్వహించే సీఎం పర్యటనకు జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉండాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 21న కోస్గి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, బహిరంగ సభ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. రోడ్లు భవనాలు, నీటిపారుదల, మిషన్ భగీరథ, ఎస్సీ, ఎస్టీ విభాగాల అధికారులతోపాటు సంక్షేమ శాఖలకు సంబంధించిన అధికారులు స్పష్టమైన సమాచారాలతో ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధించిన శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, లింగ్యానాయక్ ప్రజల నుంచి 129 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో అధికంగా రెవెన్యూ సమస్యలపై అర్జీలు రాగా.. పెన్షన్లు, భూమి కొలతలు, వ్యవసాయ, పంచాయతీ సమస్యలపై వచ్చాయి. ప్రజావాణిలో వివిధ శాఖలకు జిల్లా అధికారులున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

## భూదాన్ భూములు పేదలకే దక్కాలి

తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 19 : భూదాన్ భూములు పేదలకే దక్కాలని తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం శంకర్‌నాయక్ వికారాబాద్‌లో సర్వోదయ మండలి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ 500 ఎకరాల్లో ట్రస్టును ఏర్పాటుచేసి భూదాన్ భూముల పరిరక్షణకు కృషి చేశారని పేర్కొన్నారు. 1951-52లో భూమి లేనివారికి భూమి ఇవ్వాలనే ఉద్దేశంతో ఉద్యమాన్ని ఉధృతం చేశారని తెలిపారు. భూములు లేని వారి పక్షాన, పేదవారికి భూములు కావాలని కమ్యూనిస్టులు పోరాటం చేశారన్నారు.

ఉద్యమం ఉధృతం కావడంవల్లే ఆనాటి ప్రధానమంత్రి నెహ్రూ ఆచార్య వినోభాభావేను పిలిచి శాంతి నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని తెలిపారని పేర్కొన్నారు. ఈ పోరాటంతో చాలామంది జైల్లో ఉండేవారని, ఆ సమయంలో వినోబా భావే 40 మంది ఎస్సీ కుటుంబాలను పిలిచి సమావేశం ఏర్పాటు చేశారన్నారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఒక్కొక్కరికి రెండు ఎకరాల పొలం ఇస్తే బాగుంటుందని అభిప్రాయం తెలిపారని పేర్కొన్నారు. వెదిరే రామచంద్రారెడ్డి భూస్వామిని కలిసి పేదలకు 80 ఎకరాలు కావాలని కోరడంతో ఆయన ఉదార స్వభావంతో 100 ఎకరాల భూమిని రాసిచ్చాడని పేర్కొన్నారు.

ప్రస్తుతం భూదాన్ భూములు పేదలకు కాకుండా బడా బాబుల చేతిలో ఉన్నాయని.. ఆ భూములను తీసుకొని పేదలకు పంచాలన్నారు. వికారాబాద్ ప్రాంతంలో సుమారు 1000 ఎకరాల భూదాన్ భూములున్నాయని తెలిపారు. భూదాన్ భూములను సర్వోదయ మండలి ట్రస్ట్ నుంచి ప్రొసీడింగ్ ఇవ్వాలని, ఈ భూములపై తహసీల్దార్ల అధికారం ఉండదని ఆయన పేర్కొన్నారు. పేదలకు న్యాయం చేయాలనే సదుద్దేశంతో వికారాబాద్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన జిల్లా కమిటీని నియమించారు. సర్వోదయ మండలి వికారాబాద్ జిల్లా అధ్యక్షులుగా నస్కల్ గ్రామానికి చెందిన సుజాత, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎం రాములు, కార్యదర్శిగా కే శివకుమార్, ప్రజా ప్రతినిధిగా డి చంద్రశేఖర్, కోశాధికారులుగా బి బాలయ్య, ఆనందంలను ఎన్నుకున్నారు.

# సేవాలాల్ భావాలు, ఆశయాలను అనుసరించాలి

❍ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
❍ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలు

వికారాబాద్, ఫిబ్రవరి 19 : సద్గురు సేవాలాల్ మహరాజ్ భావాలు, ఆశయాలను అనుసరించి ప్రజలు ముందుకు సాగాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్‌లో సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డిలతో కలిసి భోగ్ బండార్ పూజా కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల సందేశాన్ని అనుసరించి వారిని ఆదర్శంగా తీసుకుంటే కొంతమేరకైనా వారి దీవెనలు మనకు ఉంటాయన్నారు. మహా పురుషుల బాటలో నడిచినట్టైతే మన జీవన విధానంలో మార్పులు వస్తాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నదని తెలుపుతూ.. ప్రజల సహకారంతో తండాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. యువత చెడు అలవాట్లకు గురికాకుండా కుటుంబంలో ఆర్థికంగా ఎదిగేందుకు తమ పాత్ర ఉండాలని సూచించారు. జిల్లాలో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్ది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని స్పీకర్ తెలిపారు.

ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి మాట్లాడుతూ.. బంజారా కుటుంబాల్లో వెలుగు నింపిన సంత్ సేవాలాల్ చిరస్మరణీయులని కొనియాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు గ్రామాలు, తండాల అభివృద్ధికి సహకారం అందించాలని ఆమె కోరారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. చదువును ఆయుధంగా మార్చుకొని సమాజంలో అన్ని రంగాల్లో బంజారా యువత రాణించాలని సూచించారు. మహనీయులను మార్గదర్శకంగా ఎంచుకొని జాతి సమూహంలో మంచిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకొని వస్తూ కార్పొరేట్ విద్యను అందిస్తున్నదని, ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు.

అనంతరం గిరిజన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో విజయకుమారి, గిరిజన అభివృద్ధి శాఖ అధికారి కోటాజీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, సద్గురు సేవాలాల్ మహరాజ్ సంఘం కమిటీ సభ్యులు కిషన్ నాయక్, పాండూనాయక్, పరశురాంనాయక్, రెడ్యానాయక్, రాఘవానాయక్, రాములునాయక్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న గిరిజన విద్యార్థినులు

కార్యక్రమానికి హాజరైన గిరిజనులు

## ఓటరు జాబితాలో తప్పిదాలకు ఆస్కారం ఉండొద్దు

◆ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
◆ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

రంగారెడ్డి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ పరిశీలన జరపాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సీఈవో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను రోజువారీగా పరిశీలిస్తూ, త్వరితగతిన పరిష్కరించేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లకు నిర్దిష్ట గడువులోపు గుర్తింపు కార్డులు చేరేలా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, ఈ-ఓటరు ఐడీని హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చుననే విషయాన్ని ఓటర్లకు తెలియజేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలని సీఈవో సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జాగ్రత్తగా గుర్తించాలన్నారు. వయో వృద్ధులు, సెక్స్ వర్కర్లు, దివ్యాంగులైన ఓటర్లను గుర్తించేందుకు, వారు పోలింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే జరిపించాలన్నారు. ముఖ్యంగా 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, అన్ని కళాశాలల్లో స్పెషల్ క్యాంపైన్ చేపట్టాలని సూచించారు.

**ఏర్పాట్లు వేగవంతం చేయాలి**

ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని.. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ తరగతులను నిర్వహించడం, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎంసిఎంసి కమిటీ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన బ్యాలెట్ పత్రాల ముద్రణ తదితర వాటిని చక్కబెట్టుకోవాలని సీఈవో సూచించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి చేపడుతున్న చర్యలకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి ఫాం- 6, 7 8 మార్పులు చేర్పులు తొలగింపులు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి కలెక్టర్ శశాంక
ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

రంగారెడ్డి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ శశాంకతోపాటు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పంపిస్తున్నారని, జిల్లాకు 5 వేల పైచిలుకు దరఖాస్తులను పంపించారని తెలిపారు. అందులో 2 వేల దరఖాస్తులు హౌసింగ్, 500 దరఖాస్తులు పెన్షన్, 1300 దరఖాస్తులు భూసమస్యలకు సంబంధించినవి కాగా.. మిగిలిన అర్జీలు ఇతర వాటిపై అందాయని తెలిపారు. దరఖాస్తులను ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. అధికారులందరూ ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జిల్లా స్థాయి శాఖలకు, సామాజిక మాధ్యమంలో ట్విట్టర్ అకౌంట్ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండలస్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులున్నారు.


ప్రజావాణికి ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

## దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు

వికారాబాద్, ఫిబ్రవరి 19 : హైదరాబాద్‌లోని బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ ఆర్టిలరీ సెంటర్లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ స్పోర్ట్స్ విభాగాల్లో బాలుర (యంగ్ బాయ్స్) అడ్మిషన్ కోసం ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్ (బహిరంగ ర్యాలీని) నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడా విభాగాల్లో ఎంపిక ట్రయల్స్ నిర్వహణ తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు, వికారాబాద్ జిల్లా వాస్తవ్యులకు బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, ఆర్టిల్లరీ సెంటర్ ఫిబ్రవరి 21 నుంచి 27 వరకు ఎంపిక ట్రయల్స్ నిర్వహిస్తాయన్నారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ స్పోర్ట్స్ విభాగాల్లో శారీరక సామర్థ్యం, సాంకేతిక నైపుణ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. అదనంగా బోర్డ్ ఆఫ్ ఆఫీసర్స్ కింద మెడికల్ టెస్ట్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. (ఆర్మీ)/ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హెడ్ క్వాటర్స్ ఆమోదించే వరకు ఎంపిక సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. బాలురు 8 నుంచి 14 సంవత్సరాలలోపు ఉండాలని, 21 ఫిబ్రవరి 2010 తరువాత, 21 ఫిబ్రవరి 2016లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. ఇంగ్లిష్, హిందీలో తగిన పరిజ్ఞానం ఉన్న ఏదైనా పాఠశాలలో 3వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ (జిల్లా/ ఉప రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నవారు), ఎత్తు, బరువు తగినంత ఉండాలని సూచించారు. బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్/ బోనఫైడ్, క్రీడల్లో ప్రతిభ (జిల్లా/ ఉప రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న సర్టిఫికెట్స్), ఆధార్ కార్డు ఉండాలన్నారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడా శిక్షణా విభాగాల్లో ప్రవేశం (అడ్మిషన్) పొందేందుకు ఆసక్తి గల బాలురు ఫిబ్రవరి 21 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని మఖాన్‌సింగ్ అథ్లెటిక్స్ స్టేడియం, లంగర్‌హౌస్, శంకర్‌పల్లి రోడ్, గోల్కొండ, ఆర్టిలరీ సెంటర్లో ఉదయం 7.00 గంటల నుంచి కొన సాగే ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

వికారాబాద్ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు

వికారాబాద్, ఫిబ్రవరి 19 : జిల్లా స్థాయి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, నినాదాలు, పోస్టర్ మూడు విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 'నేను మిలియనీర్‌గా మారినట్లయితే.. నేను ఆ డబ్బును ఎలా ఉపయోగించగలను' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహిస్తారని చెప్పారు. 300 పదాలతో ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో రాయవచ్చని పేర్కొన్నారు. 'సమ్మేళనం..పొదుపు శక్తి' అనే అంశంపై నినాదాల పోటీని నిర్వహించనున్నట్లు తెలిపారు. 'పోస్టర్ ఉటీ డిజిటల్, సైబర్ పరిశుభ్రత' అనే అంశంపై చేతితో డ్రా లేదా డిజిటల్‌గా కానీ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో వేయవచ్చునని తెలిపారు. పాల్గొనేవారి పేరు, పబ్లిక్, ప్రైవేట్ పాఠశాల, కళాశాల పేరు, వారి వయసు, ఫోన్ నం., పార్టిసిపేట్/గార్డియన్ పేరు దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మూడు పోటీల్లోని విజేతలకు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం.. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో బహుమతి, సర్టిఫికెట్‌తో పాటు సన్మానం చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనేందుకు ఈ నెల 22 సాయంత్రం 5 గంటల లోపు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈ మెయిల్ ldm.vikarabad@gmail.comకు వ్యాసం, నినాదం, పోస్టర్ల వివరాలు పంపించాలని వివరించారు.

## తెలంగాణ ప్రగతి.. దేశానికే ఆదర్శం

మంత్రి డి.శ్రీధర్ బాబు

బడంగ్‌పేట, ఫిబ్రవరి 19: తెలంగాణ ప్రగతి.. దేశానికి ఆదర్శమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహేశ్వరం మండలం రావిర్యాలలో హార్డ్‌వేర్ పార్కులో అపోలో మైక్రో సిస్టమ్స్ (డిఫెన్స్) ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఫ్యాబ్ సిటీలో రిన్యూస్ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ ఎంఓయూ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఐటీ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదన్నారు. రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామిక ప్రగతి కీలకమన్నారు. ఐటీ ఎగుమతుల్లో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఐటీ రంగానికి పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజాన్, కాంగ్రెస్ నాయకుడు లక్మారెడ్డి తదితరులు ఉన్నారు.

రావిర్యాలలో హార్డ్‌వేర్ పార్కులో అపోలో మైక్రో సిస్టమ్స్(డిఫెన్స్) ఏర్పాటుకు భూమి పూజ చేసిన మంత్రి డి శ్రీధర్ బాబు

## జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 19 : వికారాబాద్ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆసుపత్రులన్నీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాన్పులు చేసేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ లేనివారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల వారు గైనకాలజిస్టులు చేసిన కాన్పుల వివరాలను వెంటనే ఈ బర్త్ పోర్టల్‌లో (e-birth portal) ఎంట్రీ చేయాలని తెలిపారు. ప్రాధాన్యతగా అన్ని సహజ కాన్పులు చేసేటట్టు చూడాలని సూచించారు. ఇండికేషన్ లేకుండా అనవసరంగా కోత కాన్పులు అనగా సిజేరియన్ కాన్పులు నిర్వహించరాదన్నారు. ఒకవేళ చేసినచో ఆసుపత్రిపై, సంబంధిత గైనకాలజిస్ట్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ఫేక్ మెయిల్ చేసిన నిందితుడి అరెస్టు

ఎయిర్‌పోర్టుకు ఫేక్ ఈ మెయిల్స్ పంపిన నిందితుడు వైభవ్ తివారీ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 19: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఎయిర్‌పోర్టుకు ఫేక్ ఈ మెయిల్స్ చేసిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నారు. బిహార్‌కు చెందిన వైభవ్ తివారీ బెంగళూరులో ఉంటూ.. 2020 వరకు అక్కడే ఐటీ ఉద్యోగం చేశాడు. అదే సమయంలో అతడి ఉద్యోగం పోయింది. ఆ తర్వాత అతడికి ఎక్కడా ఉద్యోగం రాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. దీంతో పలువురికి తప్పుడు ఈ మెయిల్స్ పంపించాడు. ఈ నెల 15న.. 'ఎయిర్‌పోర్టును హైజాక్ చేయడంతో పాటు హత్యలు చేయడానికి వస్తున్నారు.. ఎయిర్‌పోర్టు ఓపెన్ చేయకండి'.. అంటూ ఈ మెయిల్స్ పంపించారు. 18న మరోసారి అలాగే తప్పుడు ఈ మెయిల్ చేశాడు. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# కష్టాల్లో ఆదుకుంటే.. కన్నీళ్లే మిగిల్చాడు..

● మానవత్వానికే మచ్చ తెచ్చిన నిందితుడు
● జూబ్లీహిల్స్‌లో పదేళ్ల బాలుడి హత్య కేసు
● నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19: అయ్యో పాపం అంటూ ఆదరించి అన్నం పెట్టారు.. ఖాళీగా తిరుగుతున్న కొడుకుకు డ్రైవింగ్ నేర్పించి బతుకుదెరువు చూపాడు. కష్టాలు వస్తే మేమున్నామంటూ ఆదరించారు.. అయితే, పదేళ్లుగా తనను, తన కొడుకును ఆదరించిన కుటుంబానికి విషాదాన్ని మిగుల్చుతూ.. వారి కొడుకును కడతేర్చి మానవత్వానికే మచ్చ తెచ్చాడు ఆ కిరాతకుడు.

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాభవానీనగర్‌లో ఈ నెల 13న పదేండ్ల బాలుడు కార్తీక్ హత్య కేసులో నిందితుడు రమావత్ మన్యం నాయక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు.. రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని మునావత్ తండాకు చెందిన మునావత్ రమేశ్ డ్రైవర్. జూబ్లీహిల్స్ రోడ్ నం. 5లోని దుర్గాభవానీనగర్ బస్తీలో ఉంటున్నాడు. అతడికి భార్య కవితతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. చిన్న కొడుకు మునావత్ కార్తీక్ అలియాస్ పండు (10) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. కాగా, రమేశ్‌కు దూరపు బంధువైన రమావత్ మన్యం నాయక్ (53) గతంలో దుర్గాభవానీనగర్ బస్తీలో నివాసమున్నాడు. తొమ్మిదేండ్ల కిందట అతడి భార్య క్యాన్సర్‌తో మృతి చెందడంతో.. పదేళ్ల కొడుకు మల్లేశ్ నాయక్‌ను పక్కింట్లో ఉండే రమేశ్ నాయక్ చేరదీశాడు. అతడి బాగోగులు చూసుకుని కడుపు నిండా అన్నం పెట్టేవారు. మన్యం నాయక్ మద్యానికి బానిసై కొడుకును పట్టించుకోలేదు. మల్లేశ్ నాయక్‌కు ఆటో డ్రైవింగ్ నేర్పించడంతో.. కొన్ని నెలలుగా ఆటో నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

ఇదిలా ఉండగా.. చెడు అలవాట్లకు లోనైన మన్యం నాయక్ తరచూ రమేశ్ నాయక్‌తో గొడవ పడుతుండటంతో పాటు నోటికి వచ్చినట్లు మాట్లాడేవాడు. దీంతో గత కొన్ని నెలలుగా అతడితో మాట్లాడటం మానేశారు. కాగా, ఈ నెల 13న రాత్రి 9 గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటున్న కార్తీక్‌కు మాయమాటలు చెప్పి.. తనతో పాటు తీసుకువెళ్లిన మన్యం నాయక్ సమీపంలోని పార్కులో అతడితో అనైతికంగా ప్రవర్తించాడు. దీంతో గట్టిగా కేకలు పెట్టిన కార్తీక్‌ను ముఖం మీద గట్టిగా అదమడంతో పాటు బలంగా నాలాలోకి తోసేశాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడిని హత్య చేసిన అనంతరం పరారైన మన్యం నాయక్‌పై కార్తీక్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా.. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. నిందితుడు మన్యం నాయక్ టవల్, సీసీ ఫుటేజీతో పాటు ఇతర సాక్ష్యాలతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసును ఛేదించారు. కాగా, తాము కష్టంలో ఉన్న మన్యం నాయక్‌ను ఆదుకోవడంతో పాటు కొడుకుకు దారిచూపిస్తే తమకు కడుపుకోత మిగిల్చాడంటూ.. మృతుడు కార్తీక్ తల్లిదండ్రులు కన్నీళ్ల పర్యంతం అవుతున్నారు.

నిందితుడు రమావత్ మన్యంనాయక్

## కానిస్టేబుల్ అవయవదానం

కానిస్టేబుల్ శ్యామ్‌సుందర్

ఖైరతాబాద్/మన్సూరాబాద్, ఫిబ్రవరి 19: నిత్యం ప్రజల రక్షణ కోసం ఆయన పనిచేశారు. విధి వక్రీకరించి మృత్యు రూపంలో కబళించగా, మరణించినా ముగ్గురికి జీవనదానం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నాగంపల్లికి చెందిన మేకల శ్యామ్ సుందర్ (41) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గత నెల 27న శ్యామ్ సుందర్ ఇంట్లో ఉండగా.. ఒక్కసారిగా అపస్మారక స్థితిలో కింద పడిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. 22 రోజుల పాటు ఐసీయూలో ఉంచి చికిత్స అందించినా ఫలితం రాలేదు. దీంతో ఈ నెల 18న బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు కండ్లను సేకరించారు. అవయవదానానికి ముందుకొచ్చిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.